అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలి

నేరడిగొండ, జనవరి4(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండలంలోని వాగ్దారి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గల వంటగదులను శుభ్రంగా ఉంచాలని అన్నారు. గర్భిణులు, బాలింతలకు క్రమంతప్పకుండా పోషక ఆహారం అందించాలని అన్నారు. అలాగే వంట చేసే సమయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కవిత, పంచాయతీ కార్యదర్శ ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

ఒక్కొక్క చుక్కేసి.. ముత్యాల ముగ్గేసి



...ఇలపై ఆకట్టుకున్న రంగవల్లులు



● ముత్యాల ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్య అతిథి, న్యాయ నిర్ణేతలు

- సంబురంగా 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- భారీగా తరలివచ్చిన మహిళలు, యువతులు
- ముఖ్య అతిథిగా హాజరైన కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంది మౌనాశ్రీనివాస్‌రెడ్డి
- మొదటి బహుమతిని దక్కించుకున్న పోలావార్ స్ఫూర్తి
- రెండవ స్థానంలో నిలిచిన జాదవ్ అశ్విని
- మూడవ బహుమతి పొందిన టి.రాణి

ఆదిలాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగోసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలలో మహిళలు, యువతులు పాల్గొనేందుకు భారీగా తరలివచ్చారు. సంక్రాంతి పండుగకు ముందే మహిళలు వేసిన ముత్యాల ముగ్గుల రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీంతో జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ప్రాంగణమంతా సంక్రాంతి పండుగ సందడి కనిపించింది. మహిళల చేతిలో రకరకాల రంగవల్లులు అందంగా రూపుదిద్దుకున్నాయి. హిందూ సంస్కృతీ, సంప్రదాయలకు ప్రతిబింబాలుగా.. సంక్రాంతి పండగను గుర్తుచేసుకునే విధంగా చెరకు గడలు, పెరుగు కుండలు, నవధాన్యాలు, పూర్ణకుంభాలు, కలషాలు, దేవతల ఆకృతులు, గొబ్బెమ్మలు, జాతీయ సమైక్యతను చాటే ఆకృతులు, రంగులు ముగ్గుల రూపంలో చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళామణులు తమ మనోభావాలకు దర్పణం పట్టేలా ముగ్గుల్లో దాగి ఉన్న శాస్త్రీయతను, సందేశాలను ముగ్గులు వేసి తెలిపారు. ఉదయం 9 గంటలకే మహిళలు, యువతులు పోటీలు జరిగే ప్రదేశానికి చేరుకుని తమకు కేటాయించిన స్థలాన్ని ముస్తాబు చేసుకున్నారు. ముచ్చటైన ముగ్గులను రంగులతో ఆకర్షణీయంగా రూపుదిద్దిన మహిళల్లో ముగ్గురు విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంది మౌనాశ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. మహిళలు వేసిన ముగ్గులను అన్ని కోణాల్లో పరిశీలించి అనంతరం విజేతలను ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు, మెమొంటోలను ప్రదానం చేశారు.



1 2 3

● మొదటి మూడు వరుస బహుమతులను సాధించిన ముగ్గులు



● ప్రథమ బహుమతి దక్కించుకున్న పోలావార్ స్ఫూర్తికి నగదు బహుమతిని అందజేస్తున్న కంది మౌనాశ్రీనివాస్‌రెడ్డి

నగదు బహుమతులు..

'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులు నగదు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల న్యాయ నిర్ణేతలుగా జిల్లా యువజన శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హేమలత, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వనజా, జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రమీలలు వ్యవహరించారు. సామాజిక కార్యకర్త బండారి దేవన్న హాజరయ్యారు. కాగా మొదటి బహుమతి పోలవార్‌స్పూర్తి, ద్వితీయ బహుమతి జాదవ్‌అశ్విని, మూడవ బహుమతి టి.రాణి, నాల్గవ బహుమతి జాదవ్‌రోహిణిలు దక్కించుకున్నారు. అలాగే ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు, యువతులకు కన్సోలేషన్ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ రాజేశ్వర్, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ రవీందర్, రిపోర్టర్లు రాకేష్, ప్రవీణ్, మహేందర్, రఫీ, అశోక్, పొచ్చారెడ్డి, యాడ్స్ ఇన్‌చార్జీ రాజేశ్వర్, సర్క్యూలేషన్ ఇన్‌చార్జి గంగాధర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచింది వీరే..

'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ముగ్గురు మహిళలు విజేతలుగా నిలిచారు. మొదటి స్థానంలో పోలవార్ స్ఫూర్తి (వినాయక్‌చౌక్), ద్వితీయ స్థానంలో జాదవ్ అశ్విని(ఎంప్లాయిస్ కాలనీ), తృతీయ బహుమతిని టి.రాణి (ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీ)లు గెలుపొందారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని ముఖ్య అతిథులతో పాటు న్యాయ నిర్ణేతలు పలువురు మహిళలు అభినందించారు.



● ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు



మాట్లాడుతున్న కంది మౌనాశ్రీనివాస్‌రెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● కంది మౌనారెడ్డి, కేఎస్ఆర్ ఫౌండేషన్‌చైర్మన్, ఆదిలాబాద్

మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలి. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం. ముగ్గుల పోటీలలో సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు సైన్స్ పరిజ్ఞానం కూడా దాగి ఉంటుంది. మహిళలు చదువులతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలి. ప్రతీ ఒక్కరు సేవా గుణాన్ని కలిగి ఉండడంతో పాటు సంపాధించిన దాంట్లో సగం సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలని సూచించారు. బహుమతి రాలేదని నిరుత్సాహ పడకుండా మరోసారి గెలిచేందుకు ప్రయత్నం చేయాలన్నారు. కనుమరుగై పోతున్న మన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతు మహిళలను ప్రోత్సహిస్తున్న 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. తెలుగుజాతి సంస్కృతీ, సంప్రదాయాలను, శాస్త్రీయతను రాబోయే తరాలకు అందించాలన్నారు. ఏ స్థాయిలో ఉన్న మన సంస్కృతీ, సంప్రదాయాలను మరిచి పోవద్దన్నారు. మహిళల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు 'ఆంధ్రజ్యోతి' చేస్తున్న ప్రయత్నం ఎంతో అభినందనీయం.

12ఏళ్లుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా..

: పోలావార్ స్ఫూర్తి (మొదటి బహుమతి విజేత)



గత 12 ఏళ్లుగా ముగ్గుల పోటీలలో పాల్గొంటున్నా. ప్రతియేటా 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలలో పాల్గొనడం నాకెంతో ఇష్టం. ముఖ్యంగా భర్త ప్రోత్సాహంతో ప్రతీసారి ముగ్గుల పోటీలలో పాల్గొంటున్నా. గతేడు రెండవ బహుమతి వచ్చింది. ఈసారి మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ముగ్గుల పోటీలలో పాల్గొని విజేతగా నిలవాలన్నదే నా లక్ష్యం. అవకాశం కల్పిస్తే రాష్ట్ర స్థాయిలోనూ ఆదిలాబాద్ సత్తా చాటుతాం. చిన్న నాటి నుంచి ముగ్గులు వేయడమంటే నాకు చాలా ఇష్టం. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి వాకిట్లో ముగ్గులు వేస్తే అందరూ ఎంతో అభినందిస్తారు.

అమ్మను చూసి ముగ్గులు వేయడం నేర్చుకున్నా..

: జాదవ్ అశ్విని (ద్వితీయ బహుమతి విజేత)



చిన్ననాటి నుంచి ముగ్గులు వేయడమంటే నాకు ఎంతో ఇష్టం. మా అమ్మ ముగ్గులు వేస్తుండగా చూస్తూ నేర్చుకున్నా. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' వారు నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలలో ప్రతీసారి పాల్గొంటున్నా. గతేడు మొదటి బహుమతి వచ్చింది. ఈసారి రెండవ బహుమతి వచ్చినా సంతోషంగా ఉంది. గతంలో ఎక్కువగా డిజైన్ ముగ్గులు వేసేదాన్ని. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలలో చుక్కల ముగ్గులకే ప్రాధాన్యం ఉంటుందని తెలుసుకుని అదేవిధంగా ముగ్గులు వేస్తూ విజేతగా నిలుస్తున్నా. నా గెలుపు వెనుక కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్'కి ప్రత్యేక కృతజ్ఞతలు.

బహుమతి రావడం ఆనందంగా ఉంది..

: టి.రాణి (తృతీయ బహుమతి విజేత)



'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలలో మూడవ బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈసారి మొదటి ప్రయత్నంలోనే తృతీయ బహుమతి సాధించడం సంతృప్తికరంగా ఉంది. ఇన్నాళ్లు ఇంటి వద్ద సరదాగా ముగ్గులు వేసేదాన్ని. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ముగ్గులు నిర్వహిస్తోందని తెలుసుకుని ముత్యాల ముగ్గుల పోటీలలో పాల్గొన్నాను. నా ప్రతిభను గుర్తించి బహుమతిని అందించి నన్ను ప్రోత్సహించిన 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్'కి ప్రత్యేక ధన్యవాదాలు.

జిల్లాలో వణుకు పుట్టిస్తున్న చలి

● భీంపూర్ మండలం అర్లి(టి)లో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత కొద్ది రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో చలితో జనం వణుకుతున్నారు. పగలు రాత్రీ తేడా లేకుండా చలి ప్రభావం కనిపిస్తుంది. శనివారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 30.5 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 7.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 6.2 డిగ్రీలు, బేలలో 6.9, జైనథ్‌లో 7.5, బోథ్‌లో 8.1, తాంసిలో 8.7, నేరడిగొండలో 9.0, తలమడుగులో 9.2, ఉట్నూర్‌లో 9.9, జిల్లా వ్యాప్తంగా 15 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో ప్రతియేడు డిసెంబర్, జనవరి మాసాలలో అతిశీతల మాసాలుగా పరిగణిస్తారు. సంక్రాంతి పండుగ వరకు చలి తీవ్రత అధికంగానే ఉంటుందని వాతవరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. చలి ప్రభావంతో కొన్నిరకాల పంటలకు మేలు జరుగుతున్న పత్తి, కూరగాయల పంటల పై ప్రభావం పడుతుందని రైతులు చెబుతున్నారు. ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. దీంతో వాహనదారులు హెడ్‌లైట్లతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై కురుస్తున్న పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.



● ఆదిలాబాద్ శివారు ప్రాంతాన్ని కమ్మేసిన దట్టమైన పొగమంచు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తూ..

ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి

● రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో అవగాహన కార్య క్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పెద్దఎత్తున ఆటోలతో ర్యాలీ చేపట్టారు. దీనికి కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ఆటోలతో చేపట్టిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఈ సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి 30 వరకు సడక్ సురక్ష అభియాన్ పర్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

● అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు వెలకట్టలేనివి

ఆదిలాబాద్ రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలు వెలకట్టలేవని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. జిల్లాలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మొత్తం 42 మంది అంగన్‌వాడీలు, ఆయాలకు సంబంధించిన ఆత్మీయ సమేళ్లన కార్యక్రమాన్ని ఆదిలాబాద్ టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ వారికి శాలువాలు, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అశోక్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ రాజకీయాలు, పరిస్థితులపై చర్చించారు. సోమవారం జిల్లాకేంద్రంలో జరుగనున్న పార్లమెంటరీ సమీక్ష సమావేశం, త్వరలో రానున్న ఎన్నికలు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన కార్యాచరణపై కంది శ్రీనివాస్‌రెడ్డికి టీపీసీసీ చీఫ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.



టీపీసీసీ చీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి



ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాగిన ముత్యాల ముగ్గుల పోటీ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన ముత్యాల ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలు వేసిన రంగవల్లులు.. ఇలపై హరివిల్లును తలపించాయి. కాగా, ఈ పోటీలకు ముఖ్య అతిథిగా కేఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంది మౌనాశ్రీనివాస్‌రెడ్డి హాజరై ముత్యాల ముగ్గులను తిలకించారు. యేటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ.. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'ని ఆమె అభినందించారు. ఈ పోటీలలో మహిళలు, యువతులు పాల్గొనేందుకు భారీగా తరలివచ్చారు.



రెండవ బహుమతి దక్కించుకున్న ముగ్గుతో జాదవ్‌అశ్విని



తృతీయ బహుమతి దక్కించుకున్న ముగ్గుతో విజేత టి.రాణి



స్పాన్సర్స్ లోగో ముగ్గులను వేస్తున్న యువతులు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది

విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : పీవో

ఉట్నూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు మెరుగైన ఆరోగ్యం ఉంచడంతో పాటు మెరుగైన విద్యబోధన అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యబోధనం ఎలా జరుగుతుందని 10వ తరగతి బాలికలను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి సిలబస్ త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మొవాలడ్డు, డైట్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత అరికట్టేలా విటమిన్ సి గల టాబ్లెట్‌లను అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు డైట్ మెనూ ప్రకారం పోషక విలువలు గల పచ్చి ఆకుకూరగాయల ఆహారాన్ని, మొవాలడ్డు, గుడ్లు, పాలు రాగి మాల్ట్ అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఔషధాల రిజిస్టార్ పరిశీలించి ఔసదాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

● బాలికల పాఠశాలలకు ప్రత్యేక అధికారులు

జిల్లా గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలికల ఆరోగ్యం కాపాడడానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంతరావు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని నర్సాపూర్‌బి బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అదేవిధంగా పదవ తరగతి బాలికలతో మాట్లాడారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్‌ప్రకాష్, రవీందర్ ఉపాధ్యాయులున్నారు.

● ప్రైవేట్ కంపెనీ ఉద్యోగాల కోసం తరలిన గిరిజనులు

ఉట్నూర్: ఇటీవల కేబీ కాంప్లెక్స్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికయిన గిరిజన యువతీ, యువకులను శనివారం హైదరాబాద్‌కు పంపడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా తెలిపారు. దీనిలో భాగంగా ప్రముఖ ప్రైవేట్ కంపెనీ సీతారామ్ స్పిన్నర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎంపికయిన 16 మందిని కంపెనీ బస్సులో పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ వసంత్‌రావు, పెసా కోఆర్డినేటర్ అర్క వసంతరావు, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



● వృద్ధురాలు భూమా



● సీసీ ఫుటేజీలో మోసగాడు

పెంచిన పింఛన్ ఇప్పిస్తానని మోసం

నేరడిగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.నాలుగు వేల పెంచిన పెన్షన్ ఇప్పిస్తానని వృద్ధురాలి వద్ద రూ.2 వేలతో ఉడాయించాడు ఓ మోసగాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన మేట్‌పల్లి భూమా అనే వృద్ధురాలు శనివారం మండల కేంద్రంలో గల పోస్టాఫీస్‌కు పెన్షన్ కోసం వచ్చింది. అయితే అక్కడే తచ్చాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి.. 'నేను అధికారినని, కొత్తగా రూ.నాలుగు వేల పెంచిన పెన్షన్ ఇప్పిస్తానని, పక్కన మా అధికారులు ఉన్నారు' అని నమ్మబలికాడు. అంతేకాకుండా ఆధార్ కార్డు జిరాక్స్ తెచ్చి వృద్ధురాలు భూమా అప్పుడే తీసుకున్న పెన్షన్ డబ్బులు రూ.2వేలను ఇస్తే.. తాను రూ.4వేలు తెచ్చి ఇస్తానని, ఈ విషయన్ని ఎవరికీ చెప్పవద్దని మొదటగా నీకే ఇప్పిస్తున్నానని చెప్పి రూ.2వేలు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. ఇగ వస్తడు.. అగ వస్తాడు అని గంట సేపైనా రాకపోవడంతో.. మోసపోయానని తెసుకున్న వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. స్థానికులు జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి విచారించగా సీసీ ఫుటేజ్‌లో జిరాక్స్ తీయించుకుని మోసగాడు పారిపోయినట్లు గుర్తించారు.

ఈఈగా బాధ్యతలు చేపట్టిన తానాజి

ఉట్నూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జాదవ్ తానాజి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈఈగా ఉన్న ఆసిఫాబాద్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నీరంజన్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో భద్రాచలం ఐటీడీఏ ఈఈగా పని చేస్తున్న జాదవ్ తానాజిని ఉట్నూర్ ఐటీడీఏ ఈఈగా ప్రభుత్వం నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తాను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు శివప్రసాద్, ఏఈ ఇందల్ రాథోడ్, సూపరింటెండెంట్ వామన్, మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్, కొట్నాక్ ఓమేష్, మూతిగంగాధర్, తదితరులున్నారు.

టోల్ ప్లాజా ఉద్యోగుల సమస్యలు పరిష్కంచాలి

నేరడిగొండ, జనవరి4 (ఆంధ్రజ్యోతి): టోల్ ప్లాజా ఉద్యోగుల సమస్యలు పష్కరించాలని కామారెడ్డిలో ఎన్‌హెచ్ఏఐ పీడీ శ్రీనివాస్‌కు శనివారం రోల్‌మామడ టోల్ ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను టోల్ ఆపరేట్ ట్రాన్స్‌పర్ పేరుతో కంపెనీలకు నిర్ణీత కాలానికి అప్ప చెప్పే ఒప్పందాన్ని చేసుకుంటోందని, ఇందులో రోల్‌మామడ టోల్ కూడా ఉందన్నారు. టియోటిని అమలు చేసే ముందు టోల్ ప్లాజాలో పనిచేస్తున్న ఉద్యోగులను కార్మికులను నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా తీసుకోవాలని వారన్నారు. ఇక్కడ గత 15ఏళ్ల నుంచి 240 మంది పని చేస్తున్నారన్నారు. ఇందులో టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నక్క లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు, రాజశేఖర్ రెడ్డి గోవన్సింగ్, నాయకులు సురేందర్ ఉన్నారు.

మెడిటేషన్‌పై అవగాహన అవసరం

కుభీర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం హార్ట్‌ఫుల్ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సునిల్ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకులు డా. షరీఫ్, శ్రీకాంత్, హుస్సైన్‌లు పాల్గొని విద్యార్థులకు మెడిటేషన్‌పై అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, మాధవి, శ్రీనివాస్‌రావు, సంపత్, హన్మంత్‌రావు, రమేష్, నర్సయ్య, శివరాజ్, లింగయ్య, మహేష్, గజేందర్, విద్యార్థులున్నారు.

ముథోల్ : విద్యార్థులు ధ్యానంతో ఒత్తిడి దూరం చేసుకోవచ్చని మెడిటేషన్ శిక్షకులు డాక్టర్ షరీఫ్, హుస్సేన్, శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శనివారం ముథోల్, తానూర్‌లో మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు.

దీక్ష కళాశాలలో ఘనంగా ముగ్గుల పోటీలు

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగ నేపథ్యంలో దీక్ష జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఘనంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా ముగ్గుల పోటీలు విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రమోద్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోన్ : మండలంలోని కడ్తాల్‌లో సంక్రాంతిని పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి ముగ్గులు వేశారు. ముగ్గులను వివిధ రంగులతో అందంగా పాఠశాల ఆవరణలో వేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రమేష్ బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధా, శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

సారంగాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల కౌట్ల(బీ)లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దేవారెడ్డి కుటుంబాన్ని శనివారం ఎంపీ నగేష్ పరామర్శించారు. కుటుంబసభ్యుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట బీజేపీ నాయకులు కరిపే విలాస్, రాంరెడ్డి, సాహెబ్ రావులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలీ సంఘం నాయకులు

పెంబి / (ఖానాపూర్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి సంఘ అభివృద్ధికి కృషిచేయాలని తిమ్మాపూర్ పద్మశాలి సంఘ నాయకులు ఉట్నూర్‌లో శనివారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ... సంఘ భవనం పూర్తి కావడానికి తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువాతో ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సంఘ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి ఎనగందుల రమణయ్య, కోశాధికారి రాంభీమేశ్వర్, నాయకులు బింగి అనిల్, రాజ మొగిలి, బందారి భీమన్న, రాం చిన్న భీమన్న, నడిమెట్ల రమేష్, అంకం రాజేందర్, బింగి సునీల్ పాల్గొన్నారు.

రెండోరోజు ఘనంగా సాయి పారాయణం

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శాస్త్రినగర్ ఆలయం ప్రాంగణంలో శనివారం సామూహిక సాయి పారాయణ మహోత్సవం రెండోరోజు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె

నిర్మల్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సివిల్ సప్లై గోడ ముందు జరుగుతున్న సమ్మె శిబిరాన్ని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే.లక్ష్మీ, సీపీఐ సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఫయాజ్ సందర్శించి వారికి సంపూర్ణంగా మద్దతు తెలియజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నిర్మల్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రసవం కోసం వచ్చిన ఓ మహిళ డెలివరీ అనంతరం చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన శనివారం నిర్మల్‌లో చోటుచేసుకుంది. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే తన భార్య మరణించిందని బాధితురాలి భర్త ఆరోపిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే... జిల్లాలోని కుంటాల గ్రామానికి చెందిన బడుదుల అనూష అనే మహిళ ప్రసవం కోసం గత నెల 26న నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. డెలివరీ అనంతరం అనూషకు అధికంగా బ్లీడింగ్ కావడంతో అక్కడి వైద్యులు మెరుగైన వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే అక్కడ వారం రోజుల పాటు చికిత్స పొందుతూ అనూష శనివారం మరణించింది.

● బంధువుల ఆందోళన

ప్రసవ సమయంలో నిర్మల్‌లోని ఆసుపత్రి డాక్టర్‌తో పాటు సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్లే అనూష మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు శనివారం ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ స్వర్ణ రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి సదరు ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు.



కుటుంబసభ్యులను శాంతింపజేస్తున్న పోలీసులు

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

కుంటాల, జనవరి, 4: (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో శనివారం ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కుంటాల మండలానికి చెందిన 23 మంది లబ్దిదారులకు క ళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎపీ అప్క గజ్జారాం యాదవ్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌తో పాటు పలు గ్రామాల మాజీసర్పంచ్‌లు, ఎంపీటీసీలున్నారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుంది

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ముథోల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చే పార్టీ కాంగ్రెస్ అని ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో శనివారం మహాలక్ష్మి టెంపుల్ నుంచి గాంధీ చౌక్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముథోల్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో రూ. 80 లక్షలతో సంవత్సర కాలంలోనే సీసీ రోడ్డు, డ్రైనేజీలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి తాను ఓడిపోయినప్పటికీ ఇచ్చిన మాట నెరవేర్చడానికి సీసీ రోడ్డు, డ్రైనేజీని మంజూరు చేసి నాణ్యతతో పనిని పూర్తి చేయించానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఎజాజోద్దిన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు దుడ్డు ప్రసాద్, నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, పతంగి కిషన్, రావుల శ్రీనివాస్, అజీజ్, ఖలీద్ పటేల్, ఇమ్రాన్ ఖాన్, దిగంబర్, శంకర్ చంద్రే, భోజారాం పటేల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కార్మికుల నిరసన

భైంసా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లను నెరవేర్చాలని గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు ఆందోళనలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం భైంసా మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ కార్మికులు విశ్రాంతి భవన అవరణలో భేటీ అయ్యారు. సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలంటూ నిరసన ప్రదర్శనలు చేపడుతూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయం వరకు తరలివెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో మల్టీ పర్పస్ కార్మికుల ప్రతినిధులు క్రాంతి, లక్ష్మణ్, రవి, గంగాధర్, అమృత్, ప్రకాష్, సంజీవ్, లింగం, లక్ష్మీ పాల్గొన్నారు.

తెగిన చెక్ డ్యామ్... కదిలిన రైతులు

పెంబి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంబి తండా గ్రామ సమీపంలోని కడెం వాగుపై రెండు సంవత్సరాల క్రితం చెక్ డ్యామ్ నిర్వహించారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కడెం వాగు ఉధృతి పెరగడంతో చెక్‌డ్యామ్ పక్కన తెగిపోవడంతో నీరు వృథాగా పోవడంతో వివిధ గ్రామాల రైతులు తెగిపోయిన చెక్ డ్యామ్‌ను అందరూ కలిసి బండలు, మట్టి పోసి నీరును నిల్వ ఉంచే లాగా తాత్కాలిక చెక్ డ్యామ్ నిర్వహించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.

కొనసాగుతున్న సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్షా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆర్‌డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యా యులు కోతుల ముఖ చిత్రాలను ధరించి రాజకీయ నాయకులకు, ఉపాధ్యాయ సంఘాలకు వత్తాసు కాదని తెలుపుతూ నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు గంగాధర్, రాము, ఫిరోజ్, తిరుపతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ నీరు అందక రైతులకు కష్టాలు

లోకేశ్వరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుర శ్రీ రాజరాజేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ ఆధ్వర్యంలో పది సంవత్సరాల నుంచి రైతులకు రెండు పంటలకు సరిపడా సమృద్ధిగా నీరు అందేది. రైతులు మంచి పంటలు పండించి జీవనాన్ని గడిపారు. కానీ గత మూడుసంవత్సరాల నుంచి ప్రధాన పైప్‌లైన్ లీకేజీలతో సమస్యలు రావడం,ఈ సంవత్సరం ప్రధాన పెద్ద పైప్‌లైన్‌కు గండి పడింది. అలాగే మోటార్లు రిపేర్లు కావడం, మోటార్లు రిపేరు చేయడం పెద్ద ఖర్చుతో కూడుకున్న పని. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పందించి ప్రభుత్వానికి తమ సమస్యను చేరవేసి నిధులు మంజూరు చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. సకాలంలో లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను పరిశీలించి రైతులను ఎమ్మెల్యే, లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు ఆదుకోవాలని నర్సారెడ్డి, దేవన్న, ప్రవీణ్, బొర్రన్న, రైతులు కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ఇచ్చోడ జనవరి, (ఆంధ్రజ్యోతి)4: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. శనివారం ఇచ్చోడ మండలం సిరిచెల్మ గ్రామంలో పోలీసులు మీకోసంలో భాగంగా ఉచిత మెగా వైద్యశిబిరం, రోటరిక్లబ్, తోడ్పాటుతో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగుతో ఎంతో మంది కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. గంజాయి సాగు చేసిన, తరలించిన పట్టుబడితే వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలన్నీ నిలిచి పోతాయన్నారు. పెరుగుతున్న చలిని దృష్టిలో ఉంచుకొని క్లబ్ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయం అన్నారు, కార్యక్రమంలో ఏఎస్పి కాజల్, డిఎస్పీ నాగేందర్, సైబర్‌క్రైం డిఎస్పీ హసీబ్‌ఉల్లా, సిఐ భీమేష్, ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్, మహేంధర్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో న్యాయవాద పరిషత్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాద పరిషత్ సభ్యులు మాట్లాడుతూ... న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి న్యాయవాద పరిషత్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ రాష్ట్ర కోశాధికారి మంగునాయక్, కార్యదర్శి షేర్ నరేందర్, ఉపాధ్యక్షులు నూనె గంగాధర్, కొమ్మోజి రమణ, వినోద్ కుమార్, నుంకరి రాజు, రాజేశ్వర్, రత్నం, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్టా ఒలంపియాడ్‌కు మస్కాపూర్ విద్యార్థిని ప్రతిభ

పెంబి / (ఖానాపూర్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌సీఈఆర్‌టీ, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో మస్కాపూర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని గడ్డి సంజన ప్రతిభ కనబరిచి మండల స్థాయి ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో శనివారం మండలంలోని మస్కాపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

సప్లై హమాలీ కూలీరెట్లు పెంచాలి

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లై హమాలీ కూలీ రేట్ల ఒప్పంద జీవో జారీచేయాలని కోరుతూ సివిల్ సప్లై అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రాజేందర్, కార్యదర్శి మౌలానా జిల్లా కేంద్రంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని ఎంఎల్ఎస్ గోదాం వద్ద సివిల్ సప్లై హమాలీలు, కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. గతంలో సివిల్ సప్లై హమాలీలతో రాష్ట్ర కమిషనర్ ఒప్పుకున్న రేట్ల ఒప్పంద జీవోను వెంటనే విడుదల చేయాలన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో పార్లమెంటరీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

సోన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : హైవే రోడ్డుపై వాహనదారులు ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించి ప్రయాణం చేయాలని ఆర్టీవో దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వార్షికోత్సవంలో భాగంగా కార్యక్రమానికి హాజరై వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కారు సీటు బెల్ట్ పెట్టుకుని వాహనాన్ని నడపాలని అదేవిధంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలని, హైవే నిబంధనలను పాటించాలని సూచించారు.

స్పిక్ మెకే సదస్సులో ఆర్జీయూకేటీ వీసీ

బాసర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో స్పిక్ మెకే 10వ అంతర్జాతీయ కన్వెన్షన్ అడ్వైజరీ బోర్డ్ సదస్సు విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అధ్యక్షత వహించారు. విశిష్ట సలహా మండలి సభ్యులు, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంస్కృతిని ప్రోత్సహిం చడం ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు. యువతలో శాస్త్రీయ కళలను ప్రోత్సహించడంతో పాటు లాజిస్టిక్స్ ప్రోగ్రామ్ స్ట్రక్చర్ గుర్చిన కీలక అంశాలను వివరించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక సంస్థలతో స్పిక్ మెకే ప్రపంచవ్యాప్తంగా సంస్కృతిని అందించాలని సూచించారు ఈ సంవత్సరం మే 26 నుంచి జూన్ 1, 2025 వరకు జరిగే కార్యక్రమంలో ఆర్జీయూకేటీ నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొననున్నారని వెల్లడించారు. ప్రఖ్యాత కళాకారులు పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత హరి ప్రసాద్ చౌరాసియా, పద్మ భూషణ్ అవార్డు గ్రహీతలు అమ్జద్ అలీ ఖాన్, షబానా అజ్మీ, జావేద్ అక్తర్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఈసీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జెయస్ రంజన్ ఐఏఎస్, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఐఐఐటీ డైరెక్టర్ పి.జే నారాయణన్, బిట్స్ పిలాని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రామ్ గోపాల్, ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, స్పిక్ మెకే వ్యవస్థాపకుడు డాక్టర్ కిరణ్ సేథ్, అధ్యాపకులు, డాక్టర్ రాకేష్ రెడ్డి, డాక్టర్ శ్రావణ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాదులో జరిగిన సదస్సులో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

● ఆదిలాబాద్ ఎంపీ నగేష్,
ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు నగేష్, రామారావ్ పాటిల్ తదితరులు

భైంసా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం గాను చదువుతో పాటు ఆటల్లోనూ అగ్రగాములుగా ఎదగాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌లు సూచించారు. శనివారం భైంసా పులేనగర్ సుభద్రవాటిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదిలాబాద్,నిర్మల్ జిల్లాల విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వంలో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. నేటి పోటీతత్వ యుగంలో దీటుగా రాణించేందుకు విద్యార్థులందరూ ఆత్మస్థైర్యంతో వ్యవహరిస్తూ ఏకాగ్రతతో ముందుకు సాగాలన్నారు. జీవిత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని దానికి సాధించేందుకు గాను పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికబద్ధంగా పయనించాలన్నారు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్య సాధన వైపు మనోధైర్యంతో అడుగులు వేయాలన్నారు. నైపుణ్యత,ప్రావీణ్యతలను సాధిస్తే సత్ఫలితాలుంటాయన్నారు. శిశు మందిర్ విద్యా సంస్థలు సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. శ్రీ సరస్వతీ శిశు మందిరాలు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. స్వర్గీయ డీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మెన్ మహాశెట్టివార్ దిగంబర్ రావ్ శిశు మందిర్ విద్యా సంస్థల స్థాపనకు, ప్రగతిని అనిర్వచనీయమైన సేవలు అందించారని కొనియాడారు. తమ తల్లి స్మారకార్థం శిశు మందిర్ భవన నిర్మాణం కోసం కోట్లాది రూపాయల భూమిని విరాళంగా అందించడం మహాశెట్టివారు కుటుంబీకుల ఉదార స్వభావానికి నిదర్శనమని వెల్లడించారు. ఖేల్‌కూద్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు అహుతులను అలరించాయి. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు జి. నగేష్, పవార్ రామరావ్ పాటిల్‌లు క్రీడా జ్యోతిని వెలిగించి ఖేల్‌కూద్ పోటీలను ప్రారంభించారు. ఇందులో భైంసా మండల విద్యాధికారి అనుగొండ సుభాష్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం విభాగ్ అధ్యక్షులు డా.దామోదర్ రెడ్డి, ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షులు రెడ్డిగారి హరిస్మరణ్ రెడ్డి, పాఠశాల అధ్యక్షులు రమేష్ మహాశెట్టివార్ ,ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రహదారుల భద్రతా.. మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ
మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రతా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ అధికారులతో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రహదారుల భద్రతా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా ప్రజలందరికీ రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండేలా పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిం చాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రదేశాలను గుర్తించి, తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో విద్యార్థులచే అవగాహన ర్యాలీలు చేపట్టాలని తెలిపారు. అనుకోని విధంగా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం నివారించేందుకై ఆసుపత్రులకు, అంబులెన్స్‌లకు మధ్య ప్రత్యేక లింకేజీని ఏర్పాటు చేయాలని తెలిపారు. మాసోత్సవాలకే పరిమితం కాకుండా, నిరంతరం ఈ కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో రహదారి భద్రతా మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రదేశాల్లో హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గ్రామాల్లో ర్యాలీలు చేపట్టాలని తెలిపారు. పోలీసు, రవాణా శాఖల అధికారులు సమ న్వయంతో రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రంగ్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమా దాలను నివారించాలని ఆదేశించారు. ప్రతీ ఒక్క వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. తరచూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆటో, లారీ తదితర వాహనాల సంఘాల వారితో సమావేశాలు నిర్వహించి ప్రతీ వాహన చోదకుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. రోడ్లకు మరమ్మతులు జరుగుతున్న ప్రదేశాలు, ఇరుకు రోడ్ల వంటి ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ వాహనానికి వాహన బీమా కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ మహేందర్, డీఈవో పి.రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో వాలుతాం.. దొంగను పట్టుకుంటాం!

● 100 కాల్‌తో దొంగను పట్టుకున్న ఏఎస్పీ రాజేష్ మీనా


పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దొంగతనం జరగకుండా కాపాడినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ శనివారం తెల్లవారు జామున నారాయణ్ రెడ్డి మార్కెట్ వద్ద మాక్స్ మొబైల్ షాప్ తాళాలు పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నం చేస్తున్నాడని దగ్గరలో ఉన్న వ్యక్తి ఆ షాప్ యజమానికి కాల్ చేయడంతో షాప్ యజమాని వెంటనే 100కు డయల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వటం ద్వారా తక్షణమే స్పందించిన ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, నైట్ పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై సందీప్, పెట్రోకార్‌తో పాటు తానే స్వయంగా వెళ్లి కాల్ వచ్చిన 5 నిమిషాల లోపే అట్టి దొంగను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దొంగతనానికి పాల్పడిన వాడు మైనర్ కావటం వలన జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల ఐపీఎస్ రాజేష్ మీనా ఐపీఎస్ తానే స్వయంగా తక్షణమే స్పందించి తనతో పాటు తీసుకెళ్లిన సందీప్ ఎస్సై మహేందర్ పీసీ, ప్రవీణ్ పీసీలను తీసుకెళ్లిన దొంగతనం జరగకుండా దొంగని పట్టుకున్నారని ప్రశంసించారు.

డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావును సన్మానించిన సాయిబాబా ఆలయ చైర్మన్


శ్రీహరి రావును సన్మానిస్తున్న సాయిబాబా ఆలయ చైర్మన్

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ గండి రామన్న దత్త సాయిబాబా ఆలయ చైర్మన్ గంగొని భూరాజ్ శనివారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ శ్రీహరిరావు సహకారంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ గండి రామన్న దత్త సాయిబాబా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. చైర్మన్‌తో పాటు ధర్మకర్త కత్తి సురేష్, శ్రీహరి రావును కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో ఆలయాన్ని మరింత అభి వృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఇందులో ధర్మకర్త కత్తి సురేష్, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, నాయ కులు కొట్టే శేఖర్, నరేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గాజుల రవి కుమార్, కొం తం గణేష్, శ్యామకూర రాము, మహేందర్, తదితరులున్నారు.

కన్నుల పండువగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు


పారాయణం చేస్తున్న మహిళా భక్తులు


స్వామి వారి చెంతకు విశేష పూలతో చేపట్టిన ఏర్పాట్లు

భైంసా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన నమ్మళ్వార్ పరమ పద అధ్యయనోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేద పండితులు అచార్య కళ్యాణ్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద్ కుమార్ శర్మ, అధ్యయన కర్త శ్రీమాన్ నరసింహ మూర్తి చేతుల మీదుగా నమ్మళ్వార్ పరమ పద అ. ధ్యాయనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నమ్మళ్వార్ చివరి తిరువాయి మొళిని శంఖారావం చేస్తూ వాయిద్యాలతో జీవుడు పరమపదంలో భగవంతుడిని చేరుకునే దృశ్యాన్ని అనుకరిస్తూ ఆలయం చుట్టూ శోభయాత్రగా తీసుకవెళ్లారు. అనంతరం విశేష పూలతో శోభయమానంగా అలంకరించిన పరమ పాదాల మీదుగా నమ్మళ్వార్‌ను స్వామి వారి పాదాల చెంతకు తీసుకెళ్లి భగవంతుని చెంతకు చేరుకునే ఘట్టాన్ని శాస్త్రోక్తంగా సంప్రదాయబద్ధంగా చేపట్టారు. పట్టణ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు వేడుకలకు అధిక సంఖ్యలో హజరయ్యారు. మహిళా భక్తులు అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆలయ అవరణలో పారాయణం చేపట్టారు.

గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

భోథ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో చదివే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి, ప్రిన్సిపాల్ జి. సంగీతాలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జనరల్ విద్యార్థులకు ఐదవ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షకు ఆన్‌లైన్ 100 రూపాయలు చెల్లించి ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరీక్ష రాసే అవకాశం ఉందన్నారు. అంతేగాక 6, 7, 8, 9 తరగతిలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను యూనిట్‌గా చేసుకొని ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి నాలుగవ తరగతితో పాటు 6, 7, 8, 9వ తరగతిలకు అదేరోజున అనగా ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

కాంగ్రెస్ క్యాంప్ ఆఫీస్ ముట్టడి


నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదిలాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. కొన్ని రోజులుగా సమ్మె చేపడుతు న్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం నేతలు ధరం సింగ్, అర్చన, మల్లికా, వెంకట్, భోజన్న, స్వప్న, సురేష్, రాజన్న, దీప్తి, ప్రశాంత్ రెడ్డి, దేవదర్శన్, కేశవ్ పాల్గొన్నారు.

డ్రైవర్లు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి డ్రైవర్ దృష్టి లోపం లేకుండా చూసుకుంటూ, తమ కండ్లను కాపాడుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీందర్ కుమార్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆదిలాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆటో, స్కూల్ బస్,ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లకు రవాణాశాఖ ఆధ్వర్యంలో దుర్గం ట్రస్ట్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


అంధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్

నిర్మల్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం అందుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలను సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అంధులతో కలిసి అదనపు కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తం లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. లూయిస్ బ్రెయిలీ బ్రెయిలీ లిపి కనుగొనడంతో అందులు సైతం విద్య నేర్చుకోగలుగుతున్నారని తెలిపారు. ఆయన చేసిన కృషి వల్లనే అందులు అనేక రంగాల్లో భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. నేడు అందులు విద్యను అభ్యసించి ఉద్యోగాల్లో స్థిరపడుటకు బ్రెయిలీ లిపియే ముఖ్య కారణమన్నారు. అందులు నిరాశ చెందకుండా బ్రెయిలీ లిపిని నేర్చుకుని జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సీడీపీ వోలు, అందులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే సత్ఫలితాలు

● మానసిక వైద్య నిపుణుడు డా.షరీఫ్


మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణుడు డా.షరీఫ్

భైంసా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మనోధైర్యంతో వ్యవహరిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అన్నింటా సత్ఫలితాలే దక్కుతాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డా.షరీఫ్ పేర్కొన్నారు. శనివారం భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన హర్ట్ ఫుల్ మెడిటేషన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని దూరం చేసుకునేందుకు గాను క్రమం తప్పకుండా ప్రతీ రోజు మెడిటేషన్ చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎదురయ్యే మానసిక సంఘర్షణకు మెడిటేషన్ సాధనతో చెక్ పెట్టవచ్చునని వివరించారు. ప్రతీ విద్యార్థి రోజు అరగంట మెడిటేషన్ కోసం కేటాయించాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతత చేకూరడమే కాకుండా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండటానికి ఎంతగానో దోహద పడుతుందన్నారు.వివిధ కారణలతో ఒత్తిడులకు గురవుతున్న విద్యార్థులు ఆందోళనలతో ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఇందు కొరకు గాను కలత చెందకుండా ఆత్మ విశ్వాసంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ శివ రంజని, కౌన్సిలర్లు రజనీకాంత్, చందన, ఆద్యాపకులు సందీప్ కులకర్ణితో పాటు పలువురు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే సంపూర్ణ జ్ఞానం

● ఎమ్మెల్యే పాయల్ శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే సంపూర్ణ జ్ఞానాన్ని పొందగలుగుతామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రామకృష్ణ సేవా సమితి వివేక జాగృతి ఆధ్వర్యంలో శనివారం లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మానవ విలువలను పెంపొందించడానికి పుస్తకాలు ప్రేరణ కలిగిస్తాయని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని అన్నారు. అనర్గళంగా మాట్లాడి అందరినీ ఆకట్టుకున్న వివేకానందుడు సైతం తనకున్న పుస్తక పఠన అలవాటు వల్లనే మంచి విషయాలను మాట్లాడగలిగినట్లు ఆయన చెప్పిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ మధ్యకాలంలో సెల్‌ఫోన్ వాడకం పెరిగిపోవడంతో పుస్తకం ప్రాధాన్యత తగ్గిందని అన్నారు. కానీ పుస్తకంలో చదువుకున్న విషయం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అదే కంప్యూటర్ తెరపై చదివిన అంశం కొద్దిసేపు మాత్రమే ఉండి తర్వాత మాయమైపోతుందన్నారు. ఏ విషయం తెలుసుకోవాలన్న గూగుల్‌పై ఆధారపడుతున్నారని ఒకవేళ గూగుల్ లేకుంటే ఎలా ఉంటుందో ఊహించడని అన్నారు. రామకృష్ణ సేవా సమితి మంచి ఆలోచనతో విలువైన పుస్తక బండాగారాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలను మనందరం ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మయూర్ చంద్ర, ఆదినాథ్, ముకుంద సేవా సమితి నాయకులు లెలిన్ ఉన్నారు

ఉచిత ఆరోగ్య సేవలు అందితేనే ప్రయోజనం

పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలందినప్పుడే మేలు జరుగుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ 21 చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందకపోవడంతో కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిం చాల్సి వస్తుందన్నారు. వైద్యం కోసం లక్షల్లో ఖర్చవుతుందని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు పెట్టుకుంటే రూ.20 వేలు, రూ.30 వేలు ఇస్తున్నారని అన్నారు. వైద్య సేవలపై శాసనసభలో ప్రస్తావనకు తెచ్చిన పెంపు లేదన్నారు. పేదలు సంపాదించుకునే ఆదాయంలో సగానికి పైగావైద్యం కోసమే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన వారికి పూర్తి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, రఘుపతి, కృష్ణ యాదవ్, శ్రీనివాస్, రాందాస్, దయాకర్, సంజు పాల్గొన్నారు.

రోకండ్ల రమేష్ మృతి పార్టీకి తీరని లోటు

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్అర్బన్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేష్ గుండెపోటోతో మృతి చెందారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పార్టీ శ్రేణులు, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోకండ్ల రమేష్ అస్వస్థతకు గురికావడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కాగా చికిత్స పొందుతూ రోకండ్ల రమేష్ మృతి చెందడంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోకండ్ల రమేష్ సింగిల్ విండో చైర్మన్‌గా, ఎంపీపీగాను సేవలందించారన్నారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు నేతలు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేస్తూ శ్రేణులకు దిశా నిర్దేశం చేసే ఆయన మృతి తీరని లోటన్నారు. ఆదివారం ఉదయం రోకండ్ల రమేష్ అంత్యక్రియలను జీఎస్ ఎస్టేట్‌లో నిర్వహించనున్నట్లు తెలి పారు.


రోకండ్ల రమేష్ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న జోగు రామన్న ఇన్‌సెట్లో రమేష్ (ఫైల్)

సహకార సంఘం ఏర్పాటు చేయాలని వినతి

సోన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం కావాలని మండల అధ్యక్షులు మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో డీసీవో ఆఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బర్మదాసు, మొహినుద్దీన్, ప్రసాద్, టీచర్ లింగన్న, అజార్, తదితరులున్నారు.

నిర్మల్ ఉత్సవాలకు ముస్తాబైన ఎన్టీఆర్ మినీస్టేడియం



ఇక జన జాతర

నిర్మల్, జనవరి 4 (ఆంధ్రజ్యోత) : నిర్మల్‌లో ఇకపై జనజాతర మొదలు కానుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వమే నుమాయిష్ కార్య క్రమాన్ని మూడురోజుల పాటు నిర్వహిస్తోంది. ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడు రోజులపాటు జరిగే ఈ నుమాయిష్ కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ నుమాయిష్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడమే కాకుండా ఇప్పటికే పలుసార్లు సమీక్ష సమా వేశాలు నిర్వహించి వివిధ శాఖల ఉద్యోగులకు బాధ్యతలు అప్పజెప్పారు. అలాగే జిల్లా అంతటా నుమాయిష్‌కు సంబంధించి ప్రచారం కూడా చేపట్టారు. నిర్మల్ టౌన్‌తో పాటు ఖానాపూర్, భైంసా పట్టణాల్లో భారీగా కటౌట్లు ఏర్పాటు చేసి దీని కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. నిర్మల్ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా ఈ నుమాయిష్‌ను నిర్వహించనున్నారు. ఆదివారం ప్రారంభమయ్యే ఈ నుమాయిష్ సోమ, మంగళవారం రోజుల వరకు కొనసాగనుంది. చివరి రోజు అయిన మంగళవారం భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్ రోజువారి షెడ్యూల్‌ను వెల్లడించారు. కాగా ఈ మూడు రోజుల ఎగ్జిబిషన్‌కు నిర్మల్ ఉత్సవాల పేరిట నామకరణం చేశారు. మూడు రోజుల పాటు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. కలెక్టర్ స్వీయ పర్యవేక్షణలోనే ఏర్పాట్లు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. నుమాయిష్‌ను తిలకించేందుకు కోసం వచ్చే వారికి అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. నిర్మల్ జిల్లా కీర్తి ప్రతిష్ఠలను మరింత వ్యాప్తి చేసేందుకు ఈ నిర్మల్ ఉత్సవాలు తోడ్పడతాయని కలెక్టర్ అభిప్రాయ పడుతున్నారు.

- నిర్మల్ ఉత్సవాల కోసం పూర్తయిన కసరత్తు
- నేటి నుంచి నిర్మల్‌లో నుమాయిష్
- ఎగ్జిబిషన్ కోసం భారీగా ఏర్పాట్లు
- సాంస్కృతిక వారసత్వాన్ని చాటే విధంగా ప్రదర్శనలు
- లోతుగా చర్చలు
- మూడురోజుల పాటు నిర్వహణ

మూడు రోజుల పాటు వరుస కార్యక్రమాలు

కాగా నిర్మల్ ఉత్సవాల పేరిట నిర్వహించే ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు కొనసాగనుంది. దీని కోసం రోజువారి షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మొదటి రోజు ఆదివారం ఎగ్జిబిషన్‌ను ప్రారంభించడమే కాకుండా ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను జనం తిలకించే విధంగా ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్టాళ్లు తెరిచి ఉంచనున్నారు. స్టాళ్లలో ఫుడ్‌తో పాటు పుస్తకాలు ఇతర డిస్‌ప్లేలను ప్రదర్శించనున్నారు. సాయంత్రం 5:30 నిమిషాల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రసిద్ధ ఆర్టిస్టులను సైతం ఇక్కడికి రప్పిస్తున్నారు. అలాగే డాన్సులు, పాటలు, డ్రామాలతో పాటు వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నారు. దీనికి తోడు వివిధ పాఠశాలల విద్యార్థులతో కూడా ఇష్టాగోష్ఠితో పాటు చర్చలు జరిపే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజుల పాటు ఇదే తరహా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ మూడు రోజుల షెడ్యూల్‌పై కసరత్తు జరపడమే కాకుండా ఒక్కో విభాగానికి ఒక్కో శాఖ అధికారిని ఇన్‌చార్జీగా నియమించారు. ముఖ్యంగా నిర్మల్ చరిత్రను ప్రజలందరికీ వివరించే విధంగా చర్యలు చేపట్టబోతున్నారు. ఇందులో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించబోతున్నారు. అలాగే పిల్లలకు వినోదం కోసం అవసరమైన క్రీడలను సైతం నిర్వహించబోతున్నారు. గ్రౌండ్‌లో గేమింగ్‌జోన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి 6:30 వరకు ప్రతిరోజూ నిర్మల్ చరిత్రపై భాగంగానే ఇక్కడ చరిత్రకారులను అలాగే చరిత్రకు సంబంధించిన లెక్చరర్లు ఇతర మేధావులను సైతం ఇక్కడికి రప్పించి చర్చాగోష్ఠి కార్యక్రమంలో వారు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేపట్టారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్

సాంస్కృతిక వారసత్వం చాటే విధంగా..

నిర్మల్ జిల్లా సాంస్కృతిక వారసత్వం చాటే విధంగా ఈ నిర్మల్ ఉత్సవాలను నిర్వహించబోతున్నారు. ఇక్కడి కోటలు, బురుజులను సైతం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే దారి పొడుగునా పెద్ద ఎత్తున సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇక్కడి అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పించబోతున్నారు. దీంతో పాటు నిర్మల్ జిల్లాలోని సాంస్కృతిక కళాకారులను సైతం ఇక్కడ ప్రదర్శనల కోసం అవకాశం కల్పిస్తున్నారు. అలాగే కవులు, కళాకారులను సైతం ఇక్కడికి ఆహ్వానించి వారి చేత వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు రోజుల పాటు నిర్మల్ ఉత్సవాల్లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొనే విధంగా ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ మూడు రోజుల పాటు నిర్మల్ ఉత్సవాలు స్థానిక ప్రజలను అలరించనున్నాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను తన్మయత్వానికి లోను చేయబోతున్నాయి. ఈ ప్రాంత చరిత్ర, సాంస్కృతిక ప్రతీ ఒక్కరికి తెలిసే విధంగా నిర్మల్ ఉత్సవాలు వేదికగా నిలవబోతున్నాయి.

ఫటా..ఫట్...

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గడువులోగా పూర్తిచేస్తాం

- రాజేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్, భైంసా



భైంసా పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గడువులోగా పూర్తిచేస్తామని మున్సిపల్ కమిషనర్ అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ..

ప్రశ్న: పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఏ విధంగా కొనసాగుతోంది ?

జవాబు: పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసంగాను 12,711 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 9,674 దరఖాస్తుల పరిశీలనతో 76.11 శాతం సర్వే పూర్తయింది. మరో 24 శాతం సర్వేచేపట్టాల్సి ఉంది. గడువులోగా సర్వేను పూర్తిచేసేందుకు చర్యలను ముమ్మరం చేశాం.

ప్రశ్న: సర్వే నిర్వహణలో ఎంత మంది పాల్గొంటున్నారు.?

జవాబు: మున్సిపల్ కార్యాలయ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని సర్వేకోసం వినియోగిస్తున్నాం. పట్టణ పరిధిలో 26 వార్డులుండగా మొత్తం 36 మందిని సర్వేయర్లుగా నియమించి వారి ద్వారా సర్వే నిర్వహింపచేస్తున్నాం. సర్వే పర్యవేక్షించేందుకు మరో ఆరుగురికి సూపరిండెంట్లుగా బాధ్యతలను అప్పగించాం.

ప్రశ్న:సర్వేకు దరఖాస్తుదారుల స్పందన ఏ మేరకు అందుతోంది ?

జవాబు: మిశ్రమ స్పందన లభిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తుదారులు సర్వేయర్లకు పూర్తిగా సహకరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో దరఖాస్తుదారులు స్పందించడం లేదు. వివరాలు అందివ్వడం లేదు, ఖాళీ స్థలాల వద్ద ఫొటో దిగేందుకు నిరాకరిస్తున్నారు. దరఖాస్తులు అందించే సమయంలో ఏదో అనుకొని చేసుకున్న కొంతమంది దరఖాస్తుదారులు తమకు ఇందిరమ్మ ఇండ్లు వద్దంటూ తిరస్కరిస్తున్నారు.

ప్రశ్న: సర్వే నిర్వహణలో ప్రతికూలతలు ఎలా ఉన్నాయి?.

జవాబు: ప్రధానంగా నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలతో రోజువారీ లక్ష్యం మేర సర్వే నిర్వహించలేకపోతున్నాం. దీనికి తోడు పలు ప్రాంతాల్లోని దరఖాస్తుదారులు స్థానికంగా లేకపోవడం, వారికి సమాచారం అందించినా సరైనరీతిలో స్పందించకపోవడం మూలంగా సర్వేను సకాలంలో పూర్తిచేయలేకపోతున్నాం.

ప్రశ్న : క్షేత్రస్థాయిలో సర్వే పర్యవేక్షణ చేపడుతున్నారా.?.

జవాబు: కలెక్టర్ ఆదేశాల మేరకు రోజు సర్వే పారదర్శకత కోసం గాను క్షేత్రస్థాయిలో సూపర్ చెకింగ్ సర్వే చేపడుతున్నాను. అన్ని వార్డులలో కలియ తిరిగి రోజు వారి జరిగే సర్వేలో 5 శాతం సూపర్ చెకింగ్ సర్వే నిర్వహిస్తున్నాను.

- (ఆంధ్రజ్యోతి, భైంసా)

నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌ఉత్సవాలను ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్‌లతో కలిసి నిర్మల్ ఉత్సవాల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. స్టాళ్లు, వేదిక, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నూతన సంవత్సరంలో నూతనంగా నిర్వహిస్తున్న నిర్మల్ ఉత్సవాలను ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామన్నారు. రేపటి నుంచి (ఆదివారం) ఈ నెల 7వ తేదీ వరకు మూడురోజుల పాటు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా చరిత్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేసేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్లాంట్ నిర్మాణం నిలిపి వేయాలని వినతి

పెంబి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల్‌లో నిర్మించే వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలని శనివారం మండలంలోని ఇటిక్యాల్ గ్రామస్తులు ఉట్నూర్‌లో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... అక్రమంగా అనుమతులను పొంది చేపట్టే వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఈ వాటర్ ప్లాంట్ వల్ల భవిష్యత్తులో గ్రామానికి ముప్పు వాటిల్లుతుందని భయాందోళనకు గురవుతున్నామని, గతంలో మండల అధికారులకు సైతం ఫిర్యాదులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీసర్పంచ్ మద్దెల మహేందర్, కోశాధికారి పటేల్ గణేష్, కార్యదర్శులు బాణావత్ వినాయక్, షబ్బీర్, అయిండ్ల రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఇటిక్యాల్ గ్రామస్తులు

నేడే ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ

- దివ్యనగర్‌లోని హరిహర క్షేత్రం ఆవరణలో నిర్వహణ
- జిల్లాలోని మహిళలందరూ ఆహ్వానితులే ..



ముత్యాల ముగ్గుల పోటీలకు సిద్ధం చేసిన మైదానం

నిర్మల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న సంతూర్ ముగ్గుల పోటీల గార్డెనింగ్ పార్ట్నర్ క్రాఫ్ట్ వారి పర్ఫెక్ట్ ఫ్యాషన్ పార్ట్నర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ముగ్గుల పోటీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని మల్లన్న గుట్టపై వెలసిన హరిహరక్షేత్రం ప్రాంగణంలో ఈ ముగ్గుల పోటీల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ పోటీలకు స్పాన్సర్లుగా నిర్మల్‌కు చెందిన వైష్ణవి కన్‌స్ట్రక్షన్స్ అధినేత, అయ్యప్ప ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డిలు వ్యవహ రించనున్నారు.

శనివారం ఈ ఏర్పాట్లను అయ్య ప్ప ఆలయ గురుస్వామిమూర్తి, ఆలయ కోశాధి కారి వేణుగోపాల్ రెడ్డి, అయ్యప్ప స్వాములు గంగాధర్, తదితరులు పరిశీలించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి కింద రూ. 6,000, రెండో బహుమతి కింద రూ. 4,000, అలాగే మూడోబహుమతి కింద రూ.3,000ల నగదు బహుమతిని అందజేస్తారు. ఈ ముగ్గుల పోటీలకు జిల్లాలోని మహిళలు అందరూ ఆహ్వానితులే.